క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



గొరగనమూడిలో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యసిబ్బంది

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడిలో వచ్చే వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉంటాయని, కాబట్టి నీటి కాచి చల్లార్చిన తర్వాత తాగాలని సూచించారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖల ద్వారా సరఫరా చేసే ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగడం వల్ల డీహైడ్రేషన్ నుండి ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ విజయ ప్రసాద్, ఏఎస్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు శాంతి కుమారి, ఎంఎల్ఎస్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల తీరుతో కార్మికులకు అన్యాయం



ఉండి సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

ఉండి: నల్ల చట్టాలను అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని సీఐటీయూ మండలాధ్యక్షుడు ధనికొండ శ్రీనివాస్ మండిపడ్డారు. కేంద్రం ఆదేశించింది రాష్ట్రం పాటించింది అన్నట్లు యాజమాన్యాలకు అండగా నిలుస్తూ కార్మికుల పని గంటలు 8 గంటల నుండి 10 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై శుక్రవారం ఉండి సెంటర్‌లో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలో తొక్కిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మన రాష్ట్రంలో వాటిని అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసి కార్మికులకు అన్యాయం చేశారని అన్నారు. పని గంటలు పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కింతాడ రమేష్, కడలి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, కంది గణపతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్సీ డ్రైవర్ల కష్టాలు తీర్చాలి

ఉండి: రోజురోజుకూ ఇబ్బందులు పాలవుతున్న ట్యాక్సీవాలా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండిలో ట్యాక్సీ యూనియన్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. శాఖ కార్యదర్శిగా నేదేటి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా కర్ణం సూరిబాబు, అంగర ఆంజనేయులు, కె.సుబ్బారావు, సురేష్, ఎం.రాజు నియామకమయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పెరిగిన ఆయిల్ రేట్లతో ట్యాక్సీ డ్రైవర్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిరాయిలు లేక నానా పాట్లు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్పించుకుని ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మారుతీ నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రజలందరూ విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి డా.వీర్ల క్రాంతి కుమార్ తెలిపారు. భీమవరం మారుతీ నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించార. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించి ఆరోగ్య, పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అంటువ్యాధుల గురించి వివరించి, ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎపీడమయోలజిస్ట్ గాతల సుభాష్, వైద్యాధికారి డా.ప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో జ్యేష్ఠ మాసం చివరి శుక్రవారం సందర్భంగా భీమవరం మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ పట్టణానికి చెందిన బొల్లం దుర్గారావు, ఉమాదేవి దంపతులచే అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు అందజేశారు. అనంతరం మహిళలకు పసుపు కుంకుమలను పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

ఓ సారి చూడండి.. బాగు చేయండి

- యథేచ్ఛగా పైపుల లీకేజీలు
- నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయని అధికారులు
- ట్యాంకులు శుభ్రం లేక రంగుమారుతున్న మంచినీరు



శ్రీరామపురం రోడ్డులో వృథాగా పోతున్న మంచినీరు



పీపీ రోడ్డు రిలయన్స్ బంకు వద్ద పైపు లీకేజీ ద్వారా పోతున్న మంచినీరు



4 వార్డులో రంగుమారిన మంచినీరు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో శివారు ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం కటకటలాడుతుంటే పైపు లీకేజీల వల్ల నిత్యం లక్షల లీటర్ల నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ మున్సిపల్ అధికారులకు పర్యవేక్షణ శూన్యం. లీకులకు మరమ్మతులు చేసి అడ్డుకట్ట వేయాల్సిన మున్సిపల్ వాటర్ సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. నెలల తరబడి పైపు లీకేజీలు ఉన్నప్పటికి వాటికి మరమ్మతులు చేయకపోవడంతో ఫిల్టర్ చేసిన మంచినీరు వృథాగా పోతుంది. పైపు లీకేజిల వల్ల రోడ్లపై నీళ్ల ప్రవహించడంతో రోడ్లు తెబ్బతిని గోతులు ఏర్పడుతున్నాయి.

50 నుంచి 60 పైపులకు లీకేజీలు

భీమవరం పట్టణంలో 50 నుంచి 60 పైపుల లీకేజీలు ఉన్నాయి. లీకేజీలు ఏర్పడి మూడు నుంచి నాలుగు నెలల అవుతున్న వాటికి మరమ్మతులు మాత్రం చేయడం లేదు. లీకేజీలు ఏర్పడిన వెంటనే మరమ్మతులు చేయాల్సిన అధికారులు వాటిని వదిలివేయడంతో పైపులైన్ ద్వారా నీళ్లు కలుషితం అవుతున్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగుగా లేని ప్రాంతాల్లో మంచినీళ్లు కలుషితం అవుతున్నాయి.

ట్యాంకులు శుభ్రం చేయడం లేదు:

భీమవరం పట్టణానికి మంచినీటి సరఫరా కోసం వాటర్ రిజర్వాయర్లు మొత్తం 12 ట్యాంకులు వరకు ఉన్నాయి. వాటిని నెలకు ఒకసారి శుభ్రం చేయాలి, కాని అధికార్లు నిర్లక్ష్యం కారణంగా వాటిని శుభ్రం చేయకపోవడంతో హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద ఫిల్టర్ చేసిన నీళ్లు ట్యాంకుల్లో కలుషితమై రంగు మారుతున్నాయి. అదే నీళ్లను సరఫరా చేస్తున్నారు. ట్యాంకులను శుభ్రం చేయకుండా మున్సిపల్ వాటర్ సరఫరా విభాగం అధికారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. వర్షాకాలంలో మరింత జాగ్రత్తలు తీసుకుని రక్షిత మంచినీటి సరఫరా చేయాలసిన బాధ్యత మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారులపై ఉందని గుర్తించాలి.

ప్రత్యేక అధికారి పట్టించుకోవాలి

భీమవరం పట్టణంలో లీకుల ద్వారా ఫిల్టర్ చేసి లక్షల లీటర్లు నీరు వృథాగా పోతున్న వైనంపై భీమవరం మున్సిపాలిటి ప్రత్యేకాధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహూల్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవాలి. పట్టణ ప్రజల దాహం తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకొవాలి.

ఘనంగా ఆషాఢ మాస జాతర మహోత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆషాడ మాస జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయం నుంచి అమ్మవార్లను పుట్టింటికి తీసుకువచ్చి లింగాకారం సెంటర్లోని వలివేటి వారి ఇంట మొదటి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవార్ల గరగలను పూరి గుడిసికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మేళ, తాళాలతో, బాణాసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రరావు, ఏలూరి సూర్యనారాయణ, బుట్టయ్య, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

భీమవరం: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్‌యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరం యూనియన్ రీజినల్ సెక్రటరీ కె బాల దుర్గాప్రసాద్, ఓబిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ వి విజయప్రకాష్‌లు మాట్లాడుతూ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రెటరీ దివంగత తారకనాథ్ 21వ వర్ధంతి సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అలాగే కలవపూడి, కాళ్ళ, జువ్వలపాలెం, బొండాడ శాఖల ఆధ్వర్యంలో రూ. 15 వేలు నగదు బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న చిన్నారి నందనకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.



భీమవరం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో బ్యాంక్‌యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం దృశ్యం

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ రాంభద్రిరాజు, వీ.వీ.వంశీ, జి సాయి ప్రసాదరాజు, సీహెచ్ నాగరాజు, కె పి సోము, కె శివ సుధీర్, కె శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ముగిసిన అధ్యాపకుల శిక్షణ

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులు పాటు ×కష్టం అండ్ సెమీ–కష్టం ఐసి డిజైన్ యూజింగ్ క్యాడెస్ టూల్స్ అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో ఎన్ఐటి వరంగల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే కాకినాడ (స్పార్క్ అకాడమీ), ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన అధ్యాపక శిక్షణకు వివిధ ప్రాంతాల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు నూతన టెక్నాలజీని వివరించారన్నారు. ఎన్ఐటి వరంగల్ ఐసిటి అకాడమీ చీఫ్ ఇన్విస్టిగేటర్ ప్రొఫెసర్ పి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో శిక్షణకు హాజరైన అధ్యాపకులు

శ్రీహరిరావు మాట్లాడుతూ స్కిల్స్ అభివృద్ధి చేసుకునేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్ బాలాజీ, బి లీలాకుమారి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బిహెచ్ రామకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

వీరవాసరం : ఉద్యోగ కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా మత్స్యపురి గ్రామంలో శుక్రవారం సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్లను తీసుకురావడం పరిశ్రమ అధిపతులకు కార్పొరేట్లకు ఉద్యోగ కార్మికులను తాకట్టు పెట్టడమేనని అన్నారు. దేశంలో అత్యధిక మంది పేద మధ్యతరగతి ప్రజలు కనీస వేతనాలు లేకుండా సంక్షేమ పథకాలు వర్తించకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్న పాలకులు సక్రమంగా స్పందించడం లేదన్నారు. ఒక పెన్షన్ కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనిని అభివృద్ధిని ఎట్లా చెప్తారు పాలకులే ఆలోచించుకోవాలని అన్నారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్తేరు, భారతి, కళ్యాణి, శిరీష, అన్నపూర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: దళిత వర్గాలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, భద్రతను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ 4వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లూరి మధు అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ దళిత వర్గాలలో చైతన్యం మరింత రావాలంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకుని మరింత ఏదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కోడి విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఎ వీరయ్య, ఎండి సరోజినీ, పాలవెల్లి మంగ, బిరుదుగడ్డ రమేష్, దానం విద్యాసాగర్, బూసి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

పుస్తకాల పంపిణీ

భీమవరం: పేదల విద్యాభివృద్ధికి రాజ్‌ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్‌ట్రస్ట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాలోని మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు 1.50 లక్షల పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, కొప్పినీడి శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు, యర్రంశెట్టి రాజేష్, తూటారపు రామేష్, మీసాల జయరాజ్, సుంకర దాసు, ఎండీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

యోగాంధ్ర విజయవంతం చేయాలి

ఆకివీడు: యోగాంధ్ర విజయవంతం చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది లక్షల 50 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు 4500 ప్రాంతాల్ని గుర్తించినట్లు చెప్పారు. మండలంలోని ప్రతి సచివాలయంలో ఆయా ప్రాంతాల్లో యోగా డే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుహాసిని, కమిషనర్ కృష్ణమోహన్, డీటీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయితీ కార్యదర్శులు,సచివాలయ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. యోగా డే నిర్వహణపై పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి శంఖు మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఆకివీడు : సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్



ఉండి : సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



భీమవరం హెడ్‌పోస్టాఫీసు వద్ద యోగా అవగాహనలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం: పట్టణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భీమవరం హెడ్ పోస్టాఫీస్‌లో శుక్రవారం యోగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరం డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ కె హరికృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యమేగాక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగా దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు 21వ తేదిన పోస్టాఫీసులోని 286 మంది సిబ్బందితో యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వాలకు రెవెన్యూ వ్యవస్థ పునాది

ఆకివీడు: ప్రభుత్వ రంగానికి రెవెన్యూ వ్యవస్థ పునాది లాంటిదన తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ పరిణామ క్రమాన్ని వివరించారు. రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉంటే ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఉంటుందన్నారు. అనంతరం మాజీ రెవెన్యూ ఉద్యోగిని సావిత్రిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, సీనియర్ వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: ప్రభుత్వం అప్పగించే విధులను ఉద్యోగి బాధ్యతగా నిర్వర్తిస్తేనే గ్రామస్థాయి నుంచి దేశ స్థాయి వరకు అభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ కె.నాగార్జున అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు రిటైర్డ్ వీఆర్వో బాలచంద్రుడు, వెలివర్రు వీఆర్ఏ అభిమన్యుడులను అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉండి : రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం



ఆకివీడు : సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు

పని గంటల జీఓ వెనక్కి తీసుకోవాలి

యలమంచిలి: పెట్టుబడిదారుల మెప్పుకే రాష్ట్ర ప్రభుత్వం పని గంటల జీఓ ఇచ్చిందని సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు విమర్శించారు. ఉద్యోగ, కార్మికులు పని గంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ నాయకులు పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. అందులో భాగంగానే పని గంటలు పెంపు, స్త్రీలు రాత్రి డ్యూటీలు వంటి నిర్ణయాలను రాష్ట్ర మంత్రి వర్గంలో తీర్మానం చేసి జీఓ ఇచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల మెప్పుకై చట్టాల్లో మార్పులు తెస్తున్నాయని శ్రీనివాసరావు విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవ సుధాకర్, తాడి వెంకటేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, మల్లుల ప్రసాద్, సత్తింశెట్టి పురుషోత్తం, రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పని గంటల జీఓ వెనక్కి తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

నరసాపురం: స్థానిక బస్టాండ్‌లో శుక్రవారం బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. విశాఖపట్టణంలో శనివారం జరగనున్న యోగాడే కార్యక్రమానికి నరసాపురం డిపో నుంచి మొత్తం 41 బస్సులను ప్రభుత్వ ఆదేశాలతో తరలించారు. డిపోలు దూర సర్వీస్‌లు తిరిగే బస్సులు మినహాయిస్తే ఇక కేవలం 10 బస్సులు మాత్రమే మిగిలాయి. నరసాపురం నుంచి ఏలూరు, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు ప్రతి 20 నిమిషాలకు ఓ సర్వీస్ నడుస్తుంది. పెద్ద సంఖ్యలో జనం ప్రయాణిస్తుంటారు. అయితే బస్సులు అందుబాటులో ఉండవన్న ముందస్తు సమాచారం ఏపీ ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ఇవ్వకుండా బస్సులు మొత్తం విశాఖ తరలించారు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకుని గంటలు తరబడి వేచి చూసి, తీరా విషయం తెలుసుకుని ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి జేబులకు చిల్లులు పెట్టుకున్నారు. కొంతమంది మాత్రం ప్రయాణాలు వాయిదా వేసుకుని తిరిగి ఇంటిబాట పట్టారు.



నరసాపురం బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు